ఆదివారం ఆంధ్రజ్యోతి - 02-11-2003

# ప్రేమలేఖ ప్రహసనం

ఉపోద్ఘాతం:

పదిహేను వేలకి కాగితం మీద సంతకం పెట్టించుకొని ఏడు వేలు జీతంగా ఇచ్చే కళాశాలలో పనిచేసే ఆ ఉపాధ్యాయ దంపతులు, పదహారు వేలకి సంతకం పెట్టించుకొని ఎనిమిది వేలు చేతికందించే కళాశాలలో వచ్చిచేరారు. శ్రీమతి పేరు కామాక్షి, రసాయనశాస్త్రోపాధ్యాయ. శ్రీవారి పేరు కుబేరస్వామి, అర్థశాస్త్రాధ్యాపకుడు. పురాణేతిహాసాలలో నలకూబరుడి సౌందర్య ప్రసక్తి ఉంది. కాని, కుబేరుడెంతటి అందగాడో ఎక్కడా వర్ణించబడలేదు. కుబేరుల అందమంతా ధనంలో ఉంటుంది. ఈ కుబేరస్వామి అందం అంతంత మాత్రమైనా అనాకారి మట్టుకు కాదు. ధనమే ఉంటే ఈ బోడి ఉద్యోగం చేసేవాడూ కాదు, శ్రీమతిని ఉద్యోగం చెయ్యనిచ్చేవాడూ కాదు.

అంబానీలా అంబరాల్లో ఎగిరే వ్యాపార ప్రముఖుడిగా, చలనచిత్ర నిర్మాణంలో సంచలనం కలిగించి కుబేరుడైన చిత్రనిర్మాతగా తనూ పేరుప్రతిష్ఠలు పొంది, ఐశ్వర్యనాథుడిగా తన నామధేయాన్ని సార్థకంచేసుకో ప్రయత్నించాడు. ఫలితంగా వారసత్వంగా వచ్చిన ఓ ఏభై ఎకరాల పల్లంభూమీ, మరో ఏభై ఎకరాల మెట్టభూమీ హారతికర్పూరంలా హరించుకుపోయాయి. తాకట్టు పెట్టిన లంకంత కొంప వాకట్టుగా మారిపోయింది. విద్యాభ్యాసం చేసే సమయంలో ఆర్థికశాస్త్రాన్ని అర్థం చేసుకోలేకపోయినా, జీవితంలో జీర్ణించుకొన్న తర్వాత బుద్ధిగా ఆదాయం తక్కువైనా అస్థిరమైన ఉద్యోగాల్లో ఈదులాడడం నేర్చాడు.

మెల్లకన్నులున్నవారిని 'కేకరాక్షులు' అంటే సవ్యంగా ఉంటుందిగాని, మీనాక్షిలు, పద్మాక్షిలు అని పిలవడం కొంచెం అపసవ్యంగానే ఉంటుంది. అయితే కామాక్షి సార్థకనామధేయురాలు. నేత్రానికి గల 'ప్రేమపాతనము' 'దేహదీపము' అనే పర్యాయపదాలకు, కామాక్షి సరియైన నిర్వచనమని చెప్పుకోవచ్చు. ఆమె అందమంతా ఆమె చక్షువుల్లోనే ఉంది. అలాగని ఇతరత్రా లేదని కాదు.

ఉదంతం: రసాయనిక ప్రయోగశాల పక్కనున్న ఎడసాలలో (గదిలో) విద్యార్థులు వ్రాసిన

ప్రయోగఫలితాల పుస్తకాల్ని చూసి సంతకాలు పెడ్తున్న కామాక్షి, ఒక్కసారిగా బిగుసుకుపోయింది. ఎవరీ విద్యార్థి? ఎంతటి ధైర్యంతో ప్రయోగాల పుస్తకం మొదటి పేజీలో ఎర్రటి అక్షరాలతో ప్రేమలేఖ వ్రాశాడు. నడివయసు కామాక్షి చామనచాయ వదనం ఎర్రగా కందిపోయింది. కళ్లలో రౌద్రం తాండవం చేసింది. మరుక్షణంలో మరో ఆలోచన రావడంతో సిగ్గు పడింది. కళ్లు శాంతించాయి. ఇప్పుడా ముఖం తాలూకు బుగ్గలు కోపంతో ఎరుపెక్కాయో, సిగ్గుతో ఎరుపెక్కాయో చెప్పడం కష్టం.

'ఈ కళాశాల విద్యార్థులింత మొండిఘటాలా?' అని ముక్కు మీద వేలు వేసుకోబోయి, గుండెల మీద చేయి వేసుకొంది. వ్రాసినది ఎవరై ఉంటారా అని అట్టమీద పేరు చూసింది. 'ఎ.లవకుమార్' అన్న పేరు చూసి 'పేరుకి తగ్గట్టుగానే ఉంది వీడి పిచ్చి' అనుకొంది.

'ఇంకా విద్యార్థులతో పరిచయమే కాలేదు. ఈ లవకుమార్ ఎలా ఉంటాడబ్బా?' అన్న కుతూహలం పెరుగుతున్న సమయంలో, అరడుగులకు కొద్ది తక్కువగా, దుండగీడు లక్షణాలతో కనబడ్తున్న ఓ విద్యార్థి గదిలో ప్రవేశించి, నమస్కారం చేసి 'మా పుస్తకాలు తీసుకుపోవచ్చునాండీ?' అని ప్రశ్నించాడు.

'నీ పేరు? కామాక్షి ఎదురు ప్రశ్నించింది.

'నా పేరు ఎ.ఎల్.కుమారండి' అన్నాడు అదోలా చూస్తూ. అతగాడికి చిరుమెల్ల ఉంది.

'ఇంకా వీటిని చూడ్డం కాలేదు. రేపు తీసుకుపోవచ్చు' అంది నిర్లిప్తంగా.

అతడు మరి మాట్లాడకుండా బయటకు వెళ్లిపోయాడు. 'చూడ్డానికి తుంగమొద్దులా ఉన్నావు, నీ అందానికి నేనే కావాల్సి వచ్చిందిరా దుర్మార్గుడా?' అనుకొంది కామాక్షి. ఆ పుస్తకాన్ని వెంటనే తీసుకువెళ్లి రసాయనశాస్త్ర విభాగాధిపతికీ, కళాశాల అధ్యక్షుడికీ చూపిద్దామనుకొంది. కాని అంతలోనే మరో ఆలోచన వచ్చి ఆ ప్రయత్నం మానుకొంది. ఆ పుస్తకాన్ని తన భుజసేవకములో వేసుకొని, కళాశాల ముగిసిన పిమ్మట ఇంటికి వెళ్లింది.

నలభైమంది ఉండవలసిన తరగతి గదిలో, ప్రత్యక్షమైన పదిమంది విద్యార్థులకీ అర్థశాస్త్రం తాలూకు ఓ అంశాన్ని వివరించి, అలిసిపోయి, ఆ తర్వాత మరే తరగతీ లేని కారణంగా, మధ్యాహ్నం మూడింటికే ఇంటికి వచ్చి ముడుచుకు పడుకొన్న కుబేరస్వామిని తట్టి లేపింది కామాక్షి.

భార్య మోములోని సంతోషాన్ని గమనించి, 'ఏమిటి, దేవిగారో వెలుగు వెలిగిపోతున్నారు? చేయప్రయత్నించిన మైసూర్‌పాక్ చక్కగా కుదిరిందా?' అన్నాడు.

'నేను కళాశాల నుంచి ఇప్పుడే వస్తున్నాను. మీలాగా ముందరే ఇంటికి వచ్చి ముసుగుతన్నడానికీ, వంటింటి ప్రయోగాలు చెయ్యడానికీ వీలుండాలి కదా' కామాక్షి కనురెప్పలు ఆడిస్తూ అంది.

'అహా, రేపు కళాశాలాధ్యక్షులవారి పదహారు సంవత్సరాల గారాబుపట్టికి పుట్టినరోజు పండగ కదా? అందుకని పిష్టకముల తయారీలో పాచకురాలి పాత్రలో సహాయ నిమిత్తం

వారింటికి కాని వెళ్లావేమోనని?' కుబేరస్వామి అర్థోక్తిగా ఆపివేశాడు.

'పిష్టకములా? అంటే?' అయోమయంగా అడిగింది.

'అదే, పిండివంటల తయారీలో వంట సహాయంగా వెళ్లావేమోనని'

'కావాలంటే ఓ రెండు కిలోలు తాపేశ్వరం కాజాలు కొని పంపిస్తాకాని, మీరు చెప్పినంత చెంచాగిరీ నాకు చేతకాదు.'

'అంటే కొంత చెంచాగిరీకి అంగీకరించినట్టే కదా? ఇది సరేకాని, కాస్త తేనీరిస్తావా, కుర్రవాళ్లకి పాఠం చెప్పి తలనొప్పి వచ్చింది' అన్నాడు కుమారస్వామి కొంత మాట మారుస్తూ.

'మీ తల పగిలిపోయే వార్త వినండి ముందు. ఆ తర్వాత, తేనీరే తాగుతారో, మరేదో తాగుతారో మీ ఇష్టం' అంది కామాక్షి.

కుబేరస్వామి ప్రశ్నార్థకంగా భార్య వైపు చూశాడు. 'ఓ కుర్రాడు నాకు ప్రేమలేఖ వ్రాశాడు' అంటూ, సంచీలోంచి పుస్తకాన్ని తీసి, మొదటి పుట తెరిచి అతని కందించింది. కుబేరస్వామి ఒకటికి రెండుసార్లు ఆ ప్రేమలేఖ చదివాడు.

కుబేరస్వామికి కామాక్షి అంటే చాలా యిష్టం. ఆమె పొంగులంటే మరీ యిష్టం. ఆ రెండో వాస్తవంలోంచే మొదటి నిజం మొలుచుకొచ్చిందన్న సంగతి కామాక్షి కెప్పుడూ చెప్పలేదు. నిశ్శబ్దంగా మొలిచే మొక్కలా తన ప్రేమని ఎప్పుడూ బాహాటంగా వ్యక్తం చెయ్యలేదు. ఇప్పుడీ కుర్రవెధవ? మనసు విలవిలలాడింది కుబేరస్వామికి. అయినా ఉల్లాసంగా అన్నాడు – 'అంటే నా కంటికే కాకుండా నువ్వు పైవాళ్ళకీ అందంగా కనబడ్తున్నావన్న మాట. నా హార్దిక ప్రశంసలు. అయితే ఈ కుర్రవెధవ చదువు కొండెక్కినట్టే.'

'అంటే, అతను నాకు ప్రేమలేఖ వ్రాసినందుకు మీకు చలపకారంగా లేదా?' ప్రశ్నించింది.

'చలపకారమా? అదేమిటి?'

'పిష్టకము అంటే పిండివంట ఎలాగో, చలపకారము అంటే కడుపు మంట – అర్థమయ్యిందా?'

'నేను ప్రేమించిన స్త్రీని మరొకరు తన్నుకుపోతే వచ్చేది కడుపుమంట. నేను కట్టుకున్న స్త్రీని మరొకడు ప్రేమిస్తే వచ్చేది హత్య చేయాలనే కోపం. వాక్యప్రయోగం కూడా సందర్భానుసారంగా ఉండాలి' – కుబేరస్వామి అన్నాడు.

'నేను సంగతీ, సందర్భమూ బేరీజు వేసుకునే అలా అన్నాను. నాకో అబ్బాయి ప్రేమలేఖ వ్రాశాడు. మీకే అమ్మాయీ ప్రేమలేఖ వ్రాయనందుకు కడుపు మంటగా, అంటే అసూయగా లేదూ?' కామాక్షి కొంటెగా అంది.

'నాకు రాని మాట వాస్తవమే. కాని వస్తే కనక, నీకు చూపించేటంతటి వెర్రివెధవని మట్టుకు కాదు' – కుబేరస్వామి చిన్న చురక వేశాడు.

'పత్నీద్రోహం చేసే బుద్ధి కలవారు కాబట్టి ఆ మాటనగలిగారు. పతిద్రోహం చేసే దురుద్దేశం లేని వెర్రిపీనుగుని కాబట్టి మీకు లేఖ చూపించాను' అంది కామాక్షి ఓ చిన్న కరుణ బాణాన్ని

వదుల్తూ.

'సరేకాని, ఒకరినొకరు పరిహసించుకోవడానికి స్వస్తి చెప్పి, చెయ్యవలసిందేమిటో ఆలోచించాలి. లేకపోతే ఆ చంటి వెధవ 'ఆంటీ' అంటూ వెంటబడ్తాడు. ఆ విద్యార్థిని పిలిచి గోప్యంగా మందలించమని మీ విభాగాధిపతికి చెప్పు' అన్నాడు కుబేరస్వామి కామాక్షిని దగ్గరకు తీసుకుంటూ.

కామాక్షి ఆ మర్నాడలానే చేసింది. ఏభైలు దాటిన ఆ రసాయనికశాస్త్ర విభాగాధిపతి కళ్లజోడు అంచుల్నించి దొంగచూపులు చూస్తూ కామాక్షిని మొదటిసారిగా కాస్త నిశితంగా పరిశీలించి, ఆమెలోని ఆకర్షణ చూసి మనసు పాడుచేసుకొన్నాడు. వాణ్ణి మందలిస్తానని కామాక్షిని పంపించేశాడు.

కుబేరస్వామి అదృష్టానికీ, విద్యార్థి లవకుమార్ ధైర్యానికీ ఈర్ష్య చెందాడు. ఫలితంగా మందలింపు మాట దేముడెరిగినా, ఈ వార్త కళాశాలలో ముందుగా చాప కింద నీరులా, సాయంత్రానికల్లా సంచలనంగా వ్యాపించింది.

'ఓ రసాయనప్పోగుల చీర కట్టదు. పంజాబీ దుస్తులు ధరించదు. పెదాలకు రంగు పూసుకోదు. పాదాలకు ఎత్తుమడమల పాదరక్షలు వాడదు. పుస్తకం తప్ప మరో అలంకరణ లేదు. ఈవిడగారా కుర్రవెధవకి ఎలా నచ్చిందబ్బా?' అని అమ్మాయిలూ, ఉపాధ్యాయ్యులూ పెదాలు కొరుక్కొని, డెందమున ఈసుచెందారు.

నిర్మాణం దట్టంగా ఉంటే, నిరాడంబరంగా ఉన్నా – 'స్త్రీ' పురుషులకి చిత్తచాంచల్యాన్ని కలిగిస్తుందన్న సత్యాన్ని గ్రహించిన కొందరు జ్ఞానులైన అధ్యాపకులు తమ తమ శ్రీమతులను కామాక్షితో బేరీజు వేసుకొన్నారు.

కళాశాల హద్దులు దాటి మర్నాటి కల్లా ఊరంతా ఈ వార్త కార్చిచ్చులా వ్యాపించింది. వెంటనే ఊరిలోని రెండు మహిళా సంఘాల సభ్యులు పాత్రికేయులతో సహా వచ్చి కళాశాల అధ్యక్షుల వారి మీద విరుచుకుపడ్డారు. కామాక్షీ కుబేరస్వాములు బెంబేలెత్తిపోయారు. కళాశాల అధ్యక్షుడు వారందరూ ఉండగా ఆ లేఖ రాసిన విద్యార్థి లవకుమార్‌ని పిలిచాడు. ఇతగాడు ఆ రోజున తన పుస్తకాన్ని అడిగినవాడు కాదు. తెల్లగా, అందంగా ఉన్నాడు. అంటే ఆ రోజున వచ్చిన తుంగమొద్దు ఎ.ఎల్.కుమార్ మరెవరోనన్న మాట! అందం జాలిని కలిగిస్తుంది.

అధ్యక్షుడు పుస్తకాన్ని ముందుకు తోస్తూ, 'మొదటి పేజీలో ఆ ప్రేమలేఖ రాసింది నువ్వేనా?' అని గద్దిస్తూ ప్రశ్నించాడు.

'నేనే రాశానండి, ఇంతవరకూ ఆ లేఖని పుస్తకానికే పరిమితం చేశాను. ఇప్పుడు బహిరంగంగా చదవవలసిన అవసరం వచ్చింది. ఎందుకంటే ఆ పుస్తకంలో మొదటి పేజీలో నేను రాసిన దొక్కటే నిజం! మిగిలిన పేజీలన్నీ పచ్చి అబద్ధం! చదవమంటారా?' అన్నాడు లవకుమార్ నిర్భయంగా.

అందరూ తలలు ఊపారు. లవకుమార్ గళం విప్పాడు.

'ప్రేయసీ!... ఎప్పుడు నిన్ను సమీపించినా శూన్యంగా కనబడ్తావు. నీలో ప్రవేశించి, నిన్నాక్రమించి ఏవేవో ఘాటు ప్రయోగాలు చేసి ఫలితం సాధించాలనుకొంటాను. కాని ఎప్పుడూ నువ్వు నాకు నిరాశనే కలిగిస్తున్నావు. సర్వాలంకారభూషితురాలిగా నిన్ను చూడాలనీ, వాటిని నా హస్తాలతో స్పర్శించి, స్పందించి, ఆ అనుభూతుల్నీ, స్పందనల్నీ మరచిపోకుండా పుటలలో నిక్షిప్తం చేద్దామనుకొన్న నా ఆవేదననీ, ఆరాటాన్నీ నువ్వెలా గుర్తిసావు? ఎప్పటికైనా నా కాంక్ష తీరుస్తావో, లేదో? అంతా నీ దయ! – నీ కుమార్.'

అందరూ కామాక్షి వైపు చూశారు.

'కుమార్‌ని బహిష్కరించాలి, కామాక్షిగారికి న్యాయం చెయ్యాలి!' అని అందరూ నినాదం చేశారు.

లవకుమార్ 'ఆగండి!' అని గట్టిగా అరిచాడు. అందరూ అతని వైపు చూశారు.

'నేనా లేఖని ఈ పుస్తకంలో ఆర్నెల్ల క్రితం ఈ కళాశాలలో చేరిన మరుసటి రోజే రాశాను. కావలిస్తే ఇదివరకు ఈ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగంలో పన్జేసిన వాసుదేవరావు గార్నడగండి. నాకు రసాయనశాస్త్రం అంటే చాలా అభిరుచి. కాని ప్రయోగశాలలో ఏ పరికరాలూ లేవు! అంశుమాపనం (టైట్రేషన్) చెయ్యడానికి నిర్ధారితమైన పరిమాణం గల ద్రవాన్ని కొలిచేసాధనం (పిప్పెట్టు) కాని, ఖచ్చితమైన పరిమాణంలో ద్రవాన్ని విడుదల చేసే కొలత సాధనం (బ్యూరెట్టు) కాని, ద్రవాలని కలియబెట్టడానికి శంకు పాత్రలు (కోనికల్ ఫ్లాస్క్) కాని, లేవు! లవణ విశ్లేషణలు చెయ్యడానికి లవణాలు లేవు! సంయోగచర్యలు పరిశీలించడానికి శోధన నాళికలు లేవు! ఇదీ ఈ కళాశాల రసాయన ప్రయోగశాల పరిస్థితి. ఆ ప్రేమలేఖని రాసింది ఈ ప్రయోగశాలకి! అందుకే అది నిజం!

'అయితే ఈ పుస్తకంలో పేజీలు నింపిన ప్రయోగాలన్నీ మా అధ్యాపకులు నల్లబల్ల మీద తెల్లసుద్దతో, అప్పుడప్పుడూ రంగు సుద్దలతో రాసి, గీసి చూపించినవే తప్ప మేం ప్రయోగాలు చేసి రాసినవి కావు. అందుకే ఆ పేజీలన్నీ శుద్ధఅబద్ధం! కామాక్షీదేవిగారు ఆ లేఖని తమ కన్వయం చేసుకొని నన్ను అపార్థం చేసుకొన్నారు. అయినా ఈ అలజడికి ఆ ఉత్తరమే కారణం కాబట్టి క్షమార్పణలు కోరుతున్నాను.'

ఆ మర్నాడు ఎందరికో, ఎప్పట్నుంచో తెలిసిన ఈ కళాశాల రహస్యం మొదటిసారిగా వార్తా పత్రికలలో వెల్లడయింది.

ఉపసంహారం : పూర్వాపరాలు ఆలోచించకుండా యాజమాన్యాన్ని ఇరుకున పెట్టినందుకు కళాశాల అధ్యక్షులవారికి ఉద్వాసన చెప్పడం జరిగింది. ఖ్యాతి ప్రచారం జరగడంవల్ల కుబేరస్వామీ, కామాక్షిలు 'ఏం జరిగినా నోరు విప్పమ'ని హామీపత్రం రాసిచ్చి, పది వేలు చూపించి అయిదు వేలు అందజేసే మరో కళాశాలలో చేరవలసి వచ్చింది. లవకుమార్ మరో కళాశాలలో దాదాపుగా ఇదేరకం హామీ పత్రం ఇచ్చి చేరాడు.

దేశమా! ఎటు నీ పయనం?